# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన ప్రగతి.. పౌరుల జీవితాలను సులభతరం చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ రైతులు, ఉత్పత్తిదారుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి ఎస్. జై శంకర్ స్పష్టం చేశారు.

❖ నాణ్యమైన ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు అందించడమే ఆత్మనిర్భర్ భారత్ ఉద్దేశ్యమని రక్షణ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ తెలియజేశారు.

❖ ఇస్రో రూపొందించిన జియో పోర్టల్.. రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

==============================

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశం వేగంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా అంతరిక్ష రంగానికి చెందిన శాస్త్రవేత్తలు తదితరులకు ఆయన ఈరోజు ఒక వీడియో సందేశంలో శుభాకాంక్షలు తెలిపారు. భారత్ త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనుందని, భవిష్యత్ కాలంలో తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. గడచిన 11 సంవత్సరాలలో ప్రభుత్వం అంతరిక్ష రంగంలో అనేక సంస్కరణలను అమలు చేసిందని, అంతరిక్ష రంగం ఒకదాని తర్వాత ఒకటి మైలురాయిని సాధిస్తోందని.. ఈ పురోగతి సాధారణ పౌరుల జీవితాలను సులభతరం చేస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇస్రో.. చంద్రయాన్, ఆదిత్య వంటి మిషన్లను కొనసాగిస్తుందని కేంద్ర హోం మంత్రి సామాజిక మాధ్యమ సందేశంలో పేర్కొన్నారు.

=============================

వాతావరణ పరిస్థితులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని అందించే జియో పోర్టల్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అభివృద్ధి చేసిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రైతులు తమ పంటల ప్రణాళికను రూపొందించుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంటూ.. భారత అంతరిక్ష శాస్త్రవేత్తల కృషిని ఆయన ప్రశంసించారు. ఉపగ్రహ ఆధారిత రిమోట్ సెన్సింగ్ విధానం ద్వారా ప్రభుత్వం ఇప్పుడు పంట నష్టాలపై కచ్చితమైన వివరాలను సేకరించగలదని, తద్వారా ఫసల్ బీమా యోజన కింద రైతులకు సరైన పరిహారం లభిస్తుందన్నారు. పంటల ఛాయాచిత్రాలను విశ్లేషించడం ద్వారా పంట తెగుళ్లను గుర్తించ గల కొత్త సాంకేతికతపై భారతీయ శాస్త్రవేత్తలు పని చేస్తున్నారని కేంద్ర మంత్రి తెలియజేశారు.

=============================

భారతదేశ రక్షణ రంగ ఎగుమతులు గత దశాబ్ద కాలంలో సుమారు 35 రెట్లు పెరిగాయని రక్షణ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన “వరల్డ్ లీడర్స్ ఫోరం”లో ఆయన మాట్లాడుతూ.. 2029 నాటికి రక్షణ రంగంలో 50 వేల కోట్ల రూపాయల ఎగుమతులను సాధించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుందని చెప్పారు. భారత రక్షణ ఉత్పత్తులు ప్రస్తుతం దాదాపు 100 దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ఉద్దేశ్యం దిగుమతులను తగ్గించడం మాత్రమే కాదని, దేశీయ అవసరాలను తీర్చుతూ.. అధిక నాణ్యత కలిగిన రక్షణ ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు సరఫరా చేయడమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ రక్షణ రంగ బడ్జెట్ గణనీయంగా పెరిగిందని రక్షణ మంత్రి పేర్కొంటూ ...

(వాయిస్ 35 సెకన్లు)

=============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 29 నుంచి 4 రోజుల పాటు జపాన్, చైనా దేశాల్లో పర్యటించనున్నారు. జపాన్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి ఈ నెల 29, 30వ తేదీల్లో అక్కడ జరిగే 15వ ఇండియా-జపాన్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా, ఇరు దేశాల ప్రధానమంత్రులు.. రక్షణ, భద్రత, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ఆవిష్కరణలతో సహా భారత్, జపాన్ దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షిస్తారు. అలాగే ప్రాంతీయ, ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలను కూడా చర్చిస్తారు. ప్రధానమంత్రి చైనా పర్యటనలో భాగంగా ఈ నెల 31వ తేదీ నుండి రెండు రోజుల పాటు టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు.

విరామం

=============================

భారత్ - అమెరికా దేశాల మధ్య వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ లీడర్స్ ఫోరం 2025ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దేశంలోని రైతులు, లఘు ఉత్పత్తిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమెరికాతో జరిగే చర్చల్లో భారత్ వైఖరి స్పష్టంగా ఉందని, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం స్వయం సమృద్ధి, ఆత్మనిర్భరతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్న ఆయన... ఒకే దేశ వనరుపై ఎక్కువగా ఆధారపడకూడదని ఇటీవలి అనుభవం నేర్పిందన్నారు. పాకిస్తాన్‌తో సంబంధాలపై మాట్లాడుతూ.. భారత్.. ఎవరి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించదని అన్నారు. ఈ అంశంపై భారత్ లో ఏకాభిప్రాయం ఉందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

==============================

అమెరికాకు ఈ నెల 25వ తేదీ నుండి అన్ని పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని భారత తపాలా శాఖ నిర్ణయించింది. 800 డాలర్ల వరకు విలువైన వస్తువులకు సుంకం మినహాయింపును ఉపసంహరించుకోవాలని అమెరికా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, 100 డాలర్ల వరకు బహుమతి వస్తువులపై సుంకాల నుండి మినహాయింపు కొనసాగుతుంది.

==============================

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించడం గత 11 సంవత్సరాలలో జరిగిన గొప్ప సంస్కరణ అని అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 2వ జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే మంత్రంతో అంతరిక్ష రంగం పురోగమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆస్ట్రోనాట్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా మాట్లాడుతూ.. అంతరిక్ష పరిశోధనకు సంబంధించి భారత్‌కు ప్రస్తుత కాలం స్వర్ణ యుగమన్నారు. గగన్‌యాన్ మిషన్, భారతీయ అంతరిక్ష స్టేషన్ సహా భారత్ ముందు పెద్ద ఆశయాలు ఉన్నాయని, జపాన్, యూరోపియన్ అంతరిక్ష సంస్థలు కూడా ఈ మిషన్ గురించి ఉత్సాహం కనబరుస్తున్నాయని చెప్పారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్ ఏర్పాటు కానుందని, మొదటి మాడ్యూల్ 2028 నాటికి అందుబాటులోకి వస్తుందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

ఢిల్లీ, హర్యానా, బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో రానున్న 2, 3 రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలియజేసింది. ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో కూడా ఇటువంటి పరిస్థితులు ఉంటాయని పేర్కొంది.

==============================
==============================